ఇంకో చరిత్ర

అద్దేపల్లి సుచిత్రాదేవి



కాలింగ్ బెల్ సంగీతబద్ధంగా మోగింది. ఫేట్ నవలలో పూర్తిగా లీనమయిపోయివున్న శిరీష పేజీ నెంబరు గుర్తుంచుకుని, పుస్తకం మూసేసి లేచింది.

యధాలాపంగా వెళ్లి తలుపుతీసిన శిరీష గుమ్మంలోవున్న వ్యక్తిని చూసి "కలా, నిజమా" అన్నట్లు బొమ్మలా నిలుచుండిపోయింది.

ఆమెను చూసి అతను పలకరింపుగా మృదువుగా నవ్వాడు.

"బాగున్నావా శిరీ" అడిగాడు.

ఆ స్వరంతో తెప్పరిల్లిన శిరీష చప్పున కళ్ళు వాల్చేసుకుంది.

"ఎలా అడగ్గలుగుతున్నాడా మాట ?" మౌనంగా వెనక్కి తిరిగింది. చొరవగా వెనుకే వచ్చిన అతను తనే సోఫాలో కూర్చున్నాడు, ఆమె చెప్పకపోయినా.

అతని కళ్ళు ఆమెని ఆపాద మస్తకము పరిశీలిస్తున్నాయి.

ఆ చూపులో ఆరాధన వుంది. ఆత్మీయత వుంది. యింకా అంతకన్నా చెప్పలేని మధురభావన వుంది.

శిరీష మనసు యివన్నీ గమనించే స్థితిలోలేదు.

"ఎందుకొచ్చినట్లు యిప్పుడు గౌతమ్ ? ఏమీ జరగనట్లు ఎంత మామూలుగా ప్రవర్తిస్తున్నాడు ?" అతన్ని కసితీరా తిట్టాలని, మెడపట్టి గెంటాలనివుంది వుడికిపోతున్న మనసుకు.

కానీ మనసు చేసే సూచనలు గమనించలేనట్లు స్తంభించిపోయింది మెదడు. అలానే అచేతనంగా వుండిపోయింది.

"డాక్టరుగారిని చూసేందుకు వచ్చాను. మీరిక్కడే వున్నారని తెలిసి... నిన్ను చూడాలనిపించి..." ఎదుటివారిని మంత్రముగ్ధులను చేసేలా కబుర్లు చెప్పగల అతను మాటలకోసం వెతుక్కుంటూ ఆగిపోయాడు.

ఆమె అసలు విన్నదో లేదో తలెత్తికూడా చూడలేదు. నిముషాలు నిశబ్దంలో కరిగిపోతున్నాయి. ఆ మౌనం అవమానంగా తోచింది గౌతమ్‌కి.

"మంచినీరిస్తావా శిరీషా" అడిగాడు.

ఆమె లోపలి కెళ్లింది.

ఇల్లంతా ఎక్కడి వస్తువులక్కడ చక్కని ఫర్నిచర్‌తో నీట్‌గా సర్దివుంది. మంచి అభిరుచిని తెలియచేస్తూ అక్కడక్కడా గోడలకి వున్న పెయింటింగ్స్ చూస్తున్న అతని కళ్లు ఒకేచోట ఆగిపోయాయి.

అక్కడ శిరీష, రవీంద్రల పెళ్లి ఫొటో వుంది. అందులో శిరీష పెదవులు నవ్వుతున్నట్లున్నా కళ్ళు వుదాసీనంగా వున్నాయి. అతను మాత్రం నిర్మలంగ నవ్వుతున్నాడు.

"ఆ ఫొటోలో శిరీష పక్కనుండాల్సిన తను..."

మనసులో రేగే అలజడిని అదుపులో పెట్టుకుంటూ టేబిల్ మీదున్న 'సన్‌డే' అందుకున్నాడు.

ఆ పేజీలు తిరగేస్తుండగా శిరీష చల్లని నీళ్ళు తెచ్చింది.

ఆమె వంక చూడకుండా గ్లాసు అందుకుని అందులో ఒక్కచుక్క కూడా మిగల్చకుండా అన్నీ తాగేసాడు.

* * *

"అబ్బ, మరీ దాహంతో గొంతు ఎండుకుపోతున్నట్లు ఎప్పుడు నీళ్లిచ్చినా గ్లాసులో ఒక్క

చుక్క కూడా మిగల్చక యింకా గ్లాసు కూడా ఎక్కడ మింగేస్తావో అన్నట్లు తాగుతావేమిటి ?'' ఎగతాళిగా అడిగింది శిరీష.

''మరి నీ చేత్తో యిచ్చిన నీళ్ళు అమృతము కదా, అమృతాన్ని కొద్దిగా కూడా మిగల్చకూడదు'' చిలిపిగా నవ్వాడు గౌతమ్.

''అవున్లే. ఎదురుగా వుంటె అమృతమూ, దేవతా అంటూ పొగుడు, కనుమరుగైతే అసలు గుర్తు వుండను. అవునా ?''

''మైగాడ్ నిన్ను మరిచిపోవటమా. నువ్వు నా వూపిరిలో వూహాలలో కనులలో కలలలో ... ''

''స్టాప్, యిప్పుడు నీకు యిక ఎక్కడికీ వెళ్ళాల్సిన పని లేదుగా'' మధ్యలో ఆపి అడిగింది శిరీష.

''లేదు, ఏం ?''

''రైటో, యీ నాలుగు గోడల మధ్యా ఎందుకూ, చక్కగా డాబామీద కెళదాం. ప్రొద్దున అమ్మ చేసిన స్వీట్సు తింటూ నీ కవిత్వం వింటాను'' మెట్లవైపు దారి తీసింది శిరీష.

''అవునూ, నువ్వు కాలేజి నుంచి ముందుగానే వచ్చేసావేం ? లాస్టవర్ డుమ్మానా ?'' ఆమెని అనుసరిస్తూ అడిగాడు.

''డుమ్మానే. ఆ బ్రహ్మమీసాల హిస్టరీ మాష్టరు క్లాసంటే భయం బాబూ, ప్రశ్నల మీద ప్రశ్నలడిగి దడదడ లాడించేస్తాడు,''

''అలా అని క్లాసులెగ్గొడితే రేపెవరికి నష్టం.''

''దేశానికేం నష్టం లేదులే'' తేలిగ్గా అనేసింది.

''ఆహా. పెద్ద దేశభక్తురాలు బయలుదేరిం దండీ. అన్నీ దేశానికి లాభమా, నష్టమా అని చూసే చేస్తుంది'' వెక్కిరింతగా అన్నాడు.

''అవునట. యీమధ్య యీ దేశభక్తురాలు ఓ మాటకారి అబ్బాయిగారి భక్తిలో పడిపోయిందట.''

''ప్, ఎవరీ రసాబాసగాడు ?'' అమాయకంగా అడిగాడు గౌతమ్.

''ఛ, రసాబాసకాదు, రసవత్తరమనాలి''

''వూషు, ఏ రసమట ?''

''నిమ్మరసమట'' ఫక్కున నవ్వింది శిరీష.

''మరికనేం, ప్రేమ పైత్యానికది చక్కగా పనిచేస్తుంది'' తనూ పెద్దగా నవ్వేసాడు గౌతమ్.

* * *

గతంలోని జ్ఞాపకాలతో మనసు వూగిస లాడు తుంటే అతని చేతిలోంచి కాళీ గ్లాసందుకుంది శిరీష.

ఆమె ఏమన్నా మాట్లాడుతుందేమోనని కొద్ది సేపు ఎదురు చూసాడు గౌతమ్. అయితే ఆమె పెదవి విప్పలేదు.

ఆ తిరస్కారం వూహించనిది కాకపోయినా అతని మనసు విలవిల్లాడింది. ''వెళుతున్నాను'' లేచి నిలుచున్నాడు.

హృదయాకాశంలో కమ్ముతున్న భావాల మేఘాలతో వర్షించటానికి సిద్ధంగా వున్న కళ్ళ అతని కంట పడకుండా తల అటు తిప్పుకుంది శిరీష.

గుమ్మందాకా వెళ్ళిన గౌతమ్ వెనక్కి తిరిగి అన్నాడు. ''శిరీ నువ్వీరోజు నాతో ఒక్కమాట అయినా మాట్లాడలేదు. అలా మాట్లాడలేదేం అని నీతో దెబ్బలాడే అర్హత, పలికే తీరాలని శాశించే అధికారమూ రెండు పోగొట్టుకున్నాననీ నాకు తెలుసు. అసలు నేనలా ఎందుకు చేశానని నన్ను నిలదీసి అడిగినా, నిందించినా, అవమానించినా నాకు యింత బాధ కలిగేది కాదు. కానీ అసలు నాతో మాట్లాడటమో, నా వంక చూడటమో నీకసహ్యం అన్నట్లుంది. అలాంటప్పుడు యింకా నీ ఎదుట వుండటం భావ్యం కాదు, నస్తాను. నీకింత సమీపంగా వచ్చి, నిన్ను చూడకుండా వుండలేక వచ్చాను. నేనిలా రావటం నీకు మనస్తాపం కలిగిస్తే మన్నించు.''

అతను వెళ్ళిపోయాడు. కానీ ఒక్కక్షణం వెనుదిరిగి చూసివుంటే ఆమె కన్నీరు అతని మండే మనసును చల్లబరిచి వుండేదేమో !

ఆ మరునాడు పొద్దున రవీంద్ర ఆఫీసుకు వెళ్ళిన తర్వాత, ''అంకుల్ ఏంచేస్తున్నారో నిన్నంతా వెళ్ళనేలేదు'' ఎదురింటివైపు నడిచింది శిరీష.

డాక్టరుగారు ఒక్కరు వాలుకుర్చీలో కూర్చుని చదరంగంలో పావులు సర్దుతున్నారు.

''గుడ్ మార్నింగ్ అంకుల్'' అన్న తియ్యని స్వరానికి తలఎత్తి చూసి చిన్నగా నవ్వారు.

''రామ్మా, రవీంద్ర ఆఫీసుకు వెళ్ళాడా ?'' ఆదరంగా ఆహ్వానించారు.

''ఆ, యిప్పుడే. మీరేమిటి, ఒక్కరే ఆడు కుంటున్నారా'' ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

''నువ్వొచ్చేసావుగా.''

''అదేమిటంకుల్, పరాగ్గా వున్నట్లున్నారు అన్నిటి స్థానాలు మార్చేసారు'' పావులను సవరిస్తూ అన్నది శిరీష.

దానికి నవ్వుతూ ఆయన ఏదో అనబోయేంతలో టెలిఫోన్ మ్రోగింది. లేచి వెళ్ళి రిసీసరు అందు కున్నారు.

''హలో !''

అవతల ఎవరు ఏం మాట్లాడారో కానీ డాక్టరుగారి ముఖం అదోలా మారిపోయింది.

''నో, డాక్టర్ నా వల్లకాదు. నేనిక డాక్టరుగా హాస్పిటల్లో అడుగుపెట్టేది లేదని ఎన్నోసార్లు చెప్పాను. అయినా మళ్ళీ మళ్ళీ ఎందుకడుతారు, మీరే చూసుకోండి.''

శిరీష కుతూహలంగా వింటూంది.

అవతల ఏమన్నారో ఆయనీసారి కొంచెం కటువుగా చెప్పారు.

''ఎంత క్రిటికలయినా సరే, నేను రాలేను. దయచేసి నన్ను పిలవద్దు'' చప్పున ఫోన్ పెట్టేసారు.

ఆయనలో ఏదో సంఘర్షణ వచ్చి వాలుకుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నారు.

కొద్దిసేపు మౌనంతర్వాత ''అంకుల్'' మెల్లగా పిల్చింది శిరీష.

ఆయన కళ్ళుతెరిచారు. బలవంతాన మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తూ నవ్వబోయారు.

శిరీష కొన్నిక్షణాలు తటపటాయించినా అడక్కుండా వుండలేకపోయింది.

''అంకుల్, ఎంతో అనుభవమున్న డాక్టర్ మీరు. హాస్పిటల్‌కి ఎందుకెళ్ళరు ? పేషంట్లనెందుకు చూడరు? ఎన్నోసార్లు అడగాలనుకున్నాను. నన్ను మీ అమ్మాయిలాంటి దాన్నంటారుకదా, నాకూ్కడా చెప్పకూడదా ?''

శిరీష వంకోసారిచూసి ఆయన మళ్ళీ కళ్ళు మూసుకున్నారు.





ఇవేమన పద్యాలు



ఆకుమీది వ్రాత యందటికి దెలియు
చేతిలోవి వ్రాత జెప్పవచ్చు
తోలుక్రింద వ్రాత దొడ్డవాడెఱుగురా
విశ్వదాభిరామ వినురవేమ !

తర్వాత చెప్పసాగారు. ''నిజమేనమ్మా ఎంతో అనుభవమున్న డాక్టరును నేను. మంచి డాక్టరుగా పేరుపొందాను. అయితే ఆ పేరు వల్లనే నా డయాగ్నసిస్ మీది నమ్మకంతో గౌతమ్ మరేడాక్టరుదగ్గరకు వెళ్ళక తను ప్రేమించినఅమ్మాయిని దూరం చేసుకున్నాడు. నా పొరపాటువలన ఒక ప్రేమ జంట విడిపోయింది. మనిషిగా అంతకన్నా పాపమేంచేయాలి? డాక్టరుగా వృత్తికంతకన్నా ద్రోహమేం చేయాలి?''

శిరీషకేం అర్థంకాలేదు. ''అంకుల్, ఏమిటి మీరనేది ?''

ఇంకో చరిత్ర

''అవునమ్మా, ఒకరోజు నా దగ్గరకు ఒకే పేర్లుకల యిద్దరుపేషంట్లు వచ్చారు. ఇద్దరికీ ఒకే టెస్టులు జరిగివున్నాయి. రిజల్ట్సు మారిపోయాయి. సామాన్యంగా అలాంటిపొరపాటు జరగదు. కానీ జరిగింది. ఏదో చిన్న అనుమానంతో నా దగ్గరకువచ్చిన గౌతమ్‌కి బ్లడ్‌కేన్సరని తేలింది. అసలు వ్యాధి ప్రారంభదశలో వున్నతనికి ఏవో మామూలుగా మందులువ్రాసిచ్చి పంపాను. ముఖం చూసే వ్యాధిని అంచనావేయగలననుకునే నేనే పొరపాటు పడ్డాను. నేను కేన్సరనిచెప్పిన గౌతమ్ న స్నేహితుడి బంధువులబ్బాయి. అతనికప్పటికి నె రోజులలో పెళ్ళి నిశ్చయమైవుందట. అది యిర వైపులా పెద్దలు యిష్టపడిన ప్రేమ వివాహమట ఎందరి ప్రేమకథలు పెళ్ళివరకూ వస్తాయి? అయితే మరో ఆరునెలలలో ముగియబోయే తన జీవితంతో ప్రేమించినఅమ్మాయిని పెళ్ళాడి ఆమె జీవితాన్ని బలి తీసుకోలేక గౌతమ్ ఎవరికీ ఏమీ చెప్పక యింట్లోంచి వెళ్ళిపోయాడట.''

''ఇదెవరి కథ?'' శిరీష కళ్ళు పెద్దవి చేసుకుని వింటూంది.

డాక్టరుగారు చెబుతున్నారు.

''కానీ అసలు కేన్సరున్న వ్యక్తి ఓ నెల తర్వాత మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. అతని కండిషన్ చూసి అనుమాన మొచ్చి మళ్ళీ పరీక్షలు జరిపి చూస్తే అతనికి కేన్సరు! అప్పుడు నా పొరపాటు తెలిసింది. ఏం చేయాలి నేను ? వెంటనే నా స్నేహితుడ్ని కలుసుకుని గౌతమ్ గురించి అడిగాను. అతనప్పటికే యింట్లోంచి వెళ్ళిపోయాడని తెలిసింది. ప్రేమ ఫలించక జీవితంలో యిలా ఒంటరిగా మిగిలిపోయిన నాకు ప్రేమించినవారికి దూరమై బ్రతకటం ఎంత దుర్భరమో తెలుసు. అందుకే గౌతమ్ స్నేహితులందర్నీ విచారించి అతని అడ్రసు కనుక్కోగలిగాను. అతనితో నా పొరపాటు చెప్పి వెంటనే యింటికెళ్ళి జరిగిన విషయం చెప్పుకున్నాను. అతనెంతో సంతోషంగా వెళ్ళాడు. కానీ అప్పటికే ఆ అమ్మాయికి మరో వ్యక్తితో పెళ్ళయిపోయింది. శుభలేఖలదాకా వచ్చిన పెళ్ళి అర్థాంతరంగా ఆగిపోవటంతో ఆ అమ్మాయి తండ్రి గౌతమ్ కుటుంబాన్ని నానావిధాల దూషించి తన డబ్బు, పలుకుబడితో అదే ముహూర్తానికి కూతురికి వివాహం జరిపించేసారుట. నావలనేకదూ యింత జరిగింది ? ఆ నాడే డాక్టరుగా నా వృత్తికి నేను తగనని నిర్ణయించుకున్నాను. నా హాస్పిటల్ అసిస్టెంట్లకప్పగించేసాను.

తన కారణంగా నేను వృత్తికి దూరమయ్యానని, నా విజ్ఞానాన్ని వృధా చేస్తున్నానని గౌతమ్ బాధపడతాడు. నా తప్పును అతను తన మానవత్వంతో క్షమించాడు. కానీ నన్ను నేను క్షమించుకోలేకపోతున్నాను. నిజానికి అతని ప్రేమను భగ్నం చేసిన కారణంగా నన్ను ద్వేషించివున్నా నాకింత వేదన వుండదేమో ! చిత్రంగా అతను నాకు దగ్గరయాడు నన్ను మళ్ళీ డాక్టరుగా చూడాలని, అతని ఆశ, కోరిక, కానీ... కానీ యిక నేను వైద్యం చేయలేను.'' ఆయన కన్నుల్లో తడి.

శిరీష పిచ్చిగా చూసింది. ఆమె తన మనసులోని రూపానికి కన్నీటితోనే మాలలు వేసింది.

''అంకుల్, అయితే నిన్న వచ్చినతనేనా మీరు చెప్పే గౌతమ్ !'' తడబడే స్వరంతో అడిగింది.

ఆయననుంచి వచ్చే జవాబుకై వూపిరి బి పట్టింది.

''అవునమ్మా. గౌతమ్ నాకు నచ్చచెప్పాలని చూస్తాడు, కానీ...''

ఆయనింకా ఏదో చెబుతూనే వున్నారు. కానీ శిరీషకి వినిపించింది ''అవునమ్మా'' అన్న మాట మాత్రమే. ★